## క్లుప్తంగా

### బైక్‌ల దొంగ అరెస్ట్, రిమాండ్

**వరంగల్:** ఇంతేజార్‌గంజ్ పోలీసుస్టేషన్ పరిధిలో బైక్ దొంగతనాలకు పాల్పడుతున్న మండిబజార్‌కు చెందిన ప్లంబర్ ఎండీ.అలీని అరెస్టు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ షుకూర్ తెలిపారు. అతని వద్ద నుంచి ప్లెజర్ స్కూటీ, హోండా ఫ్యాషన్ మోటార్ సైకిళ్లను గురువారం స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. విచారణలో బైక్ దొంగతనాలకు పాల్పడుతున్నట్లు తేలడంతో కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

### గుర్తుతెలియని వ్యక్తి మృతి

**రామన్నపేట:** ఎంజీఎం ఆస్పత్రి గేట్ నంబర్ -1 వద్ద ఓ గుర్తు తెలియని వ్యక్తి గురువారం మృతి చెందినట్లు మట్టెవాడ ఇన్‌స్పెక్టర్ టి.గోపి తెలిపారు. ఆ మృతదేహాన్ని ఎంజీఎంలోని మార్చురీలో భద్రపర్చినట్లు పేర్కొన్నారు. వివరాలకు 87126 85117, 87126 85005 నంబర్లలో సంప్రదించాలని సీఐ సూచించారు.

### సీవీ రామన్ జయంతి

**ఖిలా వరంగల్:** వరంగల్ రంగశాయిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో భౌతికశాస్త్ర విభాగం అధ్యాపకుల ఆధ్వర్యంలో సీవీ రామన్ జయంతి వేడుకలను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్, అధ్యాపకులు శ్రీనివాస్, ప్రేమలత, పీఎల్‌ఎస్ మూర్తి, భగీరథ, రమేష్, మినాజుద్దీన్, రాజన్న, గీత, షరీఫ్, సమీనా, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

### కబ్జాదారులపై నివేదిక ఇవ్వాలి

**హన్మకొండ కల్చరల్:** పద్మాక్షి, సిద్దేశ్వర, రంగనాయక, వీర పిచ్చమాంబ, వేణుగోపాల స్వామి దేవాలయాలకు సంబంధించిన భూముల కబ్జాలపై లోకాయుక్త కోర్టులో వినియోగదారుల మండలి రాష్ట్ర అధ్యక్షుడు సాంబరాజు చక్రపాణి, కాకతీయ వారసత్వ సంపద పరిరక్షణ సమితి కన్వీనర్ చీకటి రాజు ఫిర్యాదు చేశారు. ఈమేరకు ఈనెల 11న వరంగల్ దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ స్వయంగా హాజరు కావాలని, కబ్జాదారులపై నివేదిక ఇవ్వాలని జస్టిస్ సీవీ రాములు గురువారం ఆదేశించారు.

### రైల్వే స్టేషన్ మేనేజర్‌కు సన్మానం



**కాజీపేట రూరల్:** కాజీపేట రైల్వే స్టేషన్ మేనేజర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన అగ్గి రవీందర్‌ను తెలంగాణ రైల్వే ఎంప్లాయీస్ జేఏసీ నాయకులు గురువారం సన్మానించారు. జేఏసీ చైర్మన్ దేవులపల్లి రాఘవేందర్ రాఘవేందర్, కోండ్ర నర్సింగరావు, వి.తిరుపతి, శ్రీనుబాబు, భాస్కర్, మహేష్, సాయిరాజ్, ప్రవీణ్, జిట్టు రాజలింగం, రవీందర్, సాగర్, లక్ష్మీనారాయణ, రాజేశ్వర్ పాల్గొన్నారు.

### 15న వ్రతాలు



**హన్మకొండ కల్చరల్:** హనుమకొండ ఏషియన్ మాల్ సమీపంలోని సాయిబాబా మందిరంలో ఈనెల 15న 216మంది దంపతులతో సాయి సత్య వ్రతం, సత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహించనున్నట్లు మందిరం చైర్మన్ మతుకుమల్లి హరగోపాల్ తెలిపారు. కార్తీక పౌర్ణమి రోజు ఉదయం నుంచి రాత్రి వరకు ప్రత్యేక కార్యక్రమాలు జరుగుతాయని వివరించారు. వ్రత విశేషాలతో కూడిన కరపత్రాలను మందిరంలో గురువారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో మందిరం ధర్మకర్తలు రమేష్, నిమ్మల శ్రీనివాస్, సదానందం, అర్చకులు కిషోర్‌శర్మ, మణిశర్మ, తదితరులు పాల్గొన్నారు.

### కారులోనుంచి నగలు, నగదు చోరీ

**రామన్నపేట :** వరంగల్ నగరంలోని భద్రకాళీ రోడ్డులో పార్కింగ్ చేసిన కారులో ఉన్న నగలు, నగదును గుర్తు తెలియని వ్యక్తులు గురువారం అపహరించారు. భద్రకాళీ దేవస్థాన సమీపంలోని కీర్తి గార్డెన్‌లో జరుగుతున్న ఓ వివాహానికి మహేశ్ అనే వ్యక్తి తన బంధువుల కారులో హాజరయ్యాడు. పెళ్లి వద్దకు వెళ్లి తిరిగి వచ్చేసరికి కారు అద్దాలు పగులగొట్టి కారులో ఉన్న మూడున్నర గ్రాముల బంగారం, రూ.8 వేలు, ఐదు వేల రూపాయాల మరో జ్యూవెలరీ ఎత్తుకెళ్లినట్లు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ మేరకు మట్టెవాడ పోలీసులు ఫిర్యాదు విచారణ చేపడుతున్నారు.

### చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

**ఖిలా వరంగల్:** పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన ఓ వ్యక్తి ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి గురువారం మృతి చెందినట్లు మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్ వెంకటరత్నం తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. వరంగల్ శివనగర్‌కు చెందిన వెనుకంటి శ్రీనివాస్.. అప్పు తీర్చే పరిస్థితి లేక మనస్తాపంతో బుధవారం ఉదయం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు హుటాహుటిన ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సూచనల ప్రకారం మెరుగైన వైద్యం కోసం ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

# రాత్రివేళల్లోనూ విక్రయాలు

- అర్ధరాత్రి దాటినా మద్యం, సిగరెట్ అమ్మకాలు
- ఆర్‌ఈసీ జంక్షన్‌లో తెరిచే ఉంటున్న వైన్స్, రెండు బార్లు
- కొరవడుతున్న అధికారుల నిఘా



అభివృద్ధికి నోచుకోని జంక్షన్



రద్దీగా ఉన్న ఎన్‌ఐటీ కూడలి

**హన్మకొండ అర్బన్:** హనుమకొండ - హైదరాబాద్ హైవేపై ఆర్‌ఈసీ (ఎన్‌ఐటీ) పెట్రోల్ పంపు సమీపంలో ఉన్న జంక్షన్ నిత్యం రద్దీగా ఉంటోంది. ఈ జంక్షన్‌ను అభివృద్ధి చేయాలని, సుందరంగా తీర్చిదిద్దాలని గత ప్రభుత్వం సుమారు రూ.30 లక్షల వరకు నిధులు కేటాయించి రోడ్డు తాత్కాలిక విస్తరణ, ఫౌంటెయిన్ ఏర్పాటు చేసింది. నిర్వహణ లోపం కారణంగా అది నిర్లక్ష్యానికి గురైంది. కొద్ది కాలానికే అక్కడ ఏర్పాటు చేసిన నీటి మోటార్లు, ఇతర వస్తువులు చోరీకి గురయ్యాయి. ఈ విషయం బయటికి పొక్కకుండా అధికారులు జాగ్రత్తపడ్డారు.

**బార్లు.. బార్లా**

అభివృద్ధికి నోచుకోని ఈ జంక్షన్.. వైన్స్, బార్లలో మద్యం అమ్మకాలతో నిత్యం రద్దీగా ఉంటోంది. ఒకే ప్రాంతంలో లిక్కర్ మార్ట్, రెండు వైన్స్ షాపులు, రెండు బార్లు ఉన్నాయి. ఆ ప్రాంతంలో అదే పెద్ద కూడలి కావడం, ఎన్‌ఐటీ సమీపంలో ఉండడంతో మద్యం అమ్మకాలు అర్ధరాత్రి దాటినా కూడా కొనసాగుతూనే ఉంటాయి. బార్ షాపులకు తోడు పాన్ షాపుల నిర్వాహకులు కూడా అర్ధరాత్రి దాటినా కూడా పాన్, సిగరెట్ అమ్మకాలు చేపడుతున్నారు. ఈక్రమంలో సాధారణ జనం రాత్రి సమయంలో అటువైపు వెళ్లడానికి జంకుతున్నారు.

**మద్యంతో పాటు గంజాయి అమ్మకాలు?**

ఎన్‌ఐటీ విద్యార్థులు ఈ ప్రాంతంలో ఎక్కువగా ఉండటంతో అర్ధరాత్రి దాకా సిగరెట్, మద్యం అమ్మకాలతో పాటు 'ఫ్రెండ్స్' నుంచి గంజాయి అమ్మకాలు కూడా సాగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో కొన్ని షాపులపై అధికారులు దాడులు నిర్వహించి గంజాయి స్వాధీనం చేసుకొని కేసులు కూడా నమోదు చేసినట్లు సమాచారం. పెట్రోలింగ్ అధికారులు కూడా అర్ధరాత్రి వరకు జరిగే అమ్మకాలను చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. పోలీసు వాహనం సైరన్ వినపడగానే మద్యం యజమానులు షట్టర్ కిందికి దింపి లైట్లు బంద్ చేస్తున్నారు. ఆ వాహనం వెళ్లగానే షట్టర్ తెరిచి మళ్లీ యథావిధిగా మద్యం విక్రయాలు కొనసాగిస్తున్నారు.

# దేశానికే ఆదర్శంగా కులగణన సర్వే



కాజీపేట అర్బన్: స్టిక్కర్ అతికిస్తున్న ఎమ్మెల్యే



మధ్యకోటలో సర్వే చేస్తున్న సిబ్బంది

**కాజీపేట అర్బన్:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కులగణన సర్వే దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. 31వ డివిజన్ పరిధిలోని న్యూశాయంపేటలో ఇంటింటి సర్వేలో భాగంగా ఎమ్మెల్యే గురువారం పాల్గొని సర్వేకు ప్రజలు సహకరించాలని కోరారు. ప్రతీఒక్కరి సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ కులగణన వివరాలు సర్వేతో వెల్లడవుతాయని వివరించారు. తద్వారా ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతాయని అన్నారు. కార్యక్రమంలో బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, కార్పొరేటర్ మామిండ్ల రాజు, డిప్యూటీ కమిషనర్ రవీందర్, ఆర్‌ఐ రజిని, వార్డు ఆఫీసర్ లోకనాథం, ఆర్పీలు, అంగన్‌వాడీ టీచర్లు, సర్వే ప్రతినిధులు పాల్గొన్నారు.

**ముమ్మరంగా సమగ్ర కుటుంబ సర్వే**

**ఖిలా వరంగల్:** వరంగల్ రైల్వేగేట్ ప్రాంతంలో గురువారం రెండో రోజు సమగ్ర కుటుంబ సర్వే (కులగణన) కార్యక్రమం ముమ్మరంగా సాగింది. పలు డివిజన్లలోని శివనగర్, త్రికోట, రంగశాయిపేట, శంభునిపేట, ఉర్సు కరీమాబాద్, ఎస్ఆర్ఆర్ తోట, శాంతినగర్, కాశికుంట, ఏకశిలనగర్, విద్యానగర్ కాలనీల్లో సర్వే నిర్వహించారు. సర్వేలో సూపర్‌వైజర్లు, సిబ్బంది, కార్పొరేటర్లు ముస్కమల్ల అరుణ, మరుపల్లి రవి, దిడ్డి కుమారస్వామి, వేల్పుగొండ సువర్ణ, గుండు చందన, పల్లం పద్మ, బైరబోయిన ఉమ, ఈదుల అరుణ, సిద్ధం రాజు, గద్దె బాబు, తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణకు కృషిచేయాలి



మొక్క నాటి నీళ్లు పోస్తున్న డీఆర్‌ఓ, తదితరులు

**న్యూశాయంపేట:** పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని హనుమకొండ డీఆర్‌ఓ వైవీ.గణేష్ సూచించారు. రంగశాయిపేట శివారు జక్కలొద్ది మైనారిటీ గురుకులంలో యునైటెడ్ ఫోరం ఫర్ ఎన్విరాల్‌మెంటల్ ప్రొటెక్షన్ వరంగల్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణ - మొక్కల పెంపకం అనే అంశంపై ప్రిన్సిపాల్ కే.భిక్షపతి అధ్యక్షతన గురువారం సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఫోరం అధ్యక్షుడు రిటైర్డ్ డీఎఫ్‌ఓ పురుషోత్తం మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు విద్యార్థులు నడుం బిగించాలని కోరారు. పర్యావరణ సమతుల్యత దెబ్బతింటే జరిగే దుష్ఫలితాలను వివరించారు. రాక్‌సాయిల్‌లో మొక్కలు ఎలా పెంచాలో హార్టికల్చర్ అధికారి బి.రమేష్, పురుషోత్తం వివరించారు. విద్యార్థులతో పర్యావరణ పరిరక్షణపై ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం గురుకులం ఆవరణలో పలు మొక్కలు నాటారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఈదురు అరుణవిక్టర్, ఆర్‌ఎల్‌సీ టి.శ్రీనివాస్, సూపరింటెండెంట్ విజయపాల్‌రెడ్డి, శివాజీ, సర్వర్ మొహినొద్దీన్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## రామమందిరం 3డీ చిత్రపటం బహూకరణ



**కేయూ క్యాంపస్:** కాకతీయ యూనివర్సిటీలోని కో ఎడ్యుకేషన్ ఇంజనీరింగ్ కళాశాలలోని మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం 3డీ ప్రింటింగ్ ల్యాబరేటరీలో రూపొందించిన అయోధ్య రామమందిరం చిత్రపటాన్ని అధ్యాపకులతో కలిసి విభాగం అధిపతి డాక్టర్ సీహెచ్.రాధిక గురువారం వీసీ ప్రతాప్‌రెడ్డికి బహూకరించారు. అత్యాధునిక మిషనరీ, సాఫ్ట్‌వేర్ సాయంతో రామమందిర నిర్మాణాన్ని 3డీ ప్రింటింగ్ రూపంలో తయారు చేసేందుకు సుమారు 18గంటల సమయం పట్టిందని రాధిక వివరించారు. కార్యక్రమంలో కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మల్లారెడ్డి, రంజిత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కేయూ వీసీని కలిసిన మైనార్టీ అసోసియేషన్ బాధ్యులు



**కేయూ క్యాంపస్:** కాకతీయ యూనివర్సిటీ మైనార్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం బాధ్యులు గురువారం వీసీ ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డిని క్యాంపస్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు మహ్మద్ ఆసిం ఇక్బాల్, ఉపాధ్యక్షులు రెహమాన్, గౌసియా బేగం, జనరల్ సెక్రటరీ మహ్మద్ ఆజాం, జాయింట్ సెక్రటరీలు మహ్మద్ అఫ్జల్‌ఖాన్, మహ్మద్ వలీపాషా, మహ్మద్ గౌస్‌పాషా, కోశాధికారి డాక్టర్ కనీజ్‌ఫాతిమా, కార్యవర్గ సభ్యులు డాక్టర్ ఫిరోజ్‌పాషా, డాక్టర్ ఒవసిస్ అహ్మద్, సలోని ఫాతిమా, పర్తా ఫాతిమా, హసినాబేగం, సలీం, ఫిరోజ్, అబిద్‌అలీ, అక్బర్, గౌస్‌పాషా, ఫరూక్, తదితరులు పాల్గొన్నారు.

## కార్మికులకు పండ్లు, స్నాక్స్ పంపిణీ

**విద్యారణ్యపురి:** ప్రతాపరుద్ర కాలనీలో మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు గురువారం పండ్లు, స్నాక్స్ పంపిణీ చేశారు. సైకిల్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జంగా గోపాల్‌రెడ్డి కుమార్తె అర్చన జన్మదినాన్ని పురస్కరించుకొని ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో సైకిల్ వాకర్స్ అసోసియేషన్ కార్యదర్శి అనంత్, కోశాధికారి రమేష్, బాధ్యులు సత్యనారాయణ, సునీల్‌రెడ్డి, కాలనీవాసులు వాసుదేవరెడ్డి, చక్రపాణి, భానునాయక్, సంపత్, రమ తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



ఎంజీఎం: మాట్లాడుతున్న ఘనశ్యామ్



మాట్లాడుతున్న డీఎస్పీ విజయ్‌కుమార్

**ఎంజీఎం:** ప్రస్తుత సమాజంలో పెరుగుతున్న సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్‌బీఐ డీజీఎం ఘనశ్యామ్ సొల్లంకి సూచించారు. వరంగల్ నగరంలోని ఐఎంఏ హాల్‌లో వినియోగదారులకు సైబర్ సెక్యూరిటీపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ మోసాలను నుంచి తమను తాము రక్షించుకోవడానికి ఆన్‌లైన్ బ్యాంకింగ్ ఆధారాలను భద్రపర్చుకోవడం కీలకమని వివరించారు. సైబర్ క్రైమ్ ఏసీపీ విజయ్‌కుమార్ మాట్లాడుతూ మోసగాళ్లు మనో భావోద్వేగాలను ఉపయోగించి తమను మోసం చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ఫిషింగ్ దాడులను ఎలా గుర్తించాలనే విషయాలను ఎస్‌బీఐ సెక్యూరిటీ నిపుణుడు ప్రశాంత్‌కుమార్, ఎజీఎం సుబ్రహ్మణ్యం వివరించారు. ఈ కార్యక్రమంలో కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ రాంకుమార్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

**సీనియర్ సిటిజన్స్ ఫోరం కార్యాలయంలో..**

**కాజీపేట అర్బన్:** సైబర్ నేరాలపై వృద్ధులు అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీ విజయ్‌కుమార్ సూచించారు. హనుమకొండ నక్కలగుట్టలోని సీనియర్ సిటిజన్స్ ఫోరం కార్యాలయంలో ఫోరం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ చంద్రమౌళి ఆధ్వర్యంలో గురువారం సైబర్ అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా డీఎస్పీ విజయ్‌కుమార్ పాల్గొని మాట్లాడుతూ సైబర్ నేరాల బారిన 46 శాతం మంది వృద్ధులు పడ్డారని తెలిపారు. అపరిచితుల నుంచి కాల్స్ వస్తే తమ వివరాలు తెలియజేయవద్దని అన్నారు. తమ ప్రమేయం లేకుండా డబ్బులు డ్రా అయితే వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 1930కు కాల్ చేసి సమాచారం అందించాలన్నారు. సీనియర్ సిటిజన్స్ ట్రిబ్యునల్ కోర్ట్ మెంబర్ డాక్టర్ అనితారెడ్డి, ఫోరం సెక్రటరీ దేవాచారి, సరళకుమారి, గోపాల్‌రెడ్డి, విజయలక్ష్మి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

# కార్మికుల ప్రయోజనాలను కాపాడాలి




వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కార్మికులు

**కాజీపేట:** అసంఘటిత రంగంలో పనిచేస్తున్న భవన నిర్మాణ రంగ కార్మికుల ప్రయోజనాలను కాపాడాటానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నూతన చట్టాలకు రూపకల్పన చేసి అమలు చేయాలని ఉమ్మడి వరంగల్ జిల్లా కన్వీనర్ ఇమ్మడి బాబు డిమాండ్ చేశారు. ఈనెల 10న జరగనున్న డివిజన్ కమిటీ ఎన్నికల వాల్‌పోస్టర్లను శ్రీస్వామి వివేకానంద గృహ నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కాజీపేట మీడియా పాయింట్ ఆవరణలో గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న ఇబ్బందుల పరిష్కారం కోసం సంఘాలకు అతీతంగా కార్మికులు కలిసికట్టుగా ఉండాలని సూచించారు. సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తేలు సారంగపాణి, సంఘం బాధ్యులు జేరిపోతుల దేవేందర్, నూటెంకి సాంబయ్య, సాయి, స్వామి, ఎర్ర రాజు, ఐలయ్య, రాజయ్య, అశోక్, సత్యం పాల్గొన్నారు.

# మత్తు పదార్థాలు విక్రయిస్తే కఠిన చర్యలు



తనిఖీ చేస్తున్న యాంటీ డ్రగ్స్ టీం

**కాశిబుగ్గ:** మత్తు పదార్థాలు రవాణా చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తప్పవని యాంటీ డ్రగ్స్ టీం ఇన్‌చార్జ్ ఇన్‌స్పెక్టర్ సురేష్ హెచ్చరించారు. మత్తు పదార్థాల నియంత్రణలో భాగంగా యాంటీ డ్రగ్ టీం, ఇంతేజార్‌గంజ్ పోలీసుల ఆధ్వర్యంలో వరంగల్ రైల్వే స్టేషన్‌లో గురువారం తనిఖీలు చేపట్టారు. అనుమానాస్పదంగా కనిపించిన ప్రయాణికుల బ్యాగులను పోలీస్ జాగిలాలతో తనిఖీ చేయించారు. ఈ సందర్భంగా సీఐ సురేష్ మాట్లాడుతూ గంజాయి, మత్తు పదార్థాల సమాచారాన్ని 87125 84473కు ఫోన్ చేసి తెలపాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతాయని పేర్కొన్నారు. తనిఖీల్లో ఆర్‌ఐ శివకేశవులు, ఆర్‌ఎస్సై పూర్ణ చంద్రారెడ్డి, ఎస్సై చాంద్‌పాషా, ఏఎస్సై సాంబయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

# జాతీయ సదస్సు పోస్టర్ ఆవిష్కరణ




జాతీయ సదస్సు పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వీసీ, రిజిస్ట్రార్, తదితరులు

**కేయూ క్యాంపస్:** ఈనెల 26న రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని కాకతీయ యూనివర్సిటీలోని ఎస్సీ, ఎస్టీ సెల్ ఆధ్వర్యంలో ఒకరోజు జాతీయ సదస్సును నిర్వహించనున్నారు. 75 ఇయర్స్ ఆఫ్ కాన్‌స్టిట్యూషన్ మైల్ స్టోన్స్ ఇష్యూస్ అండ్ చాలెంజెస్ అనే అంశంపై నిర్వహించనున్న జాతీయ సదస్సు పోస్టర్లను వీసీ ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మల్లారెడ్డి, అధ్యాపకులు గురువారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో కేయూ ఎస్సీ, ఎస్టీ సెల్ డైరెక్టర్ డాక్టర్ రాజమణి, యూనివర్సిటీ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వరలక్ష్మి, అసిస్టెంట్ రిజిస్ట్రార్లు డాక్టర్ కోల శంకర్, డాక్టర్ వల్లాల పృథ్వీరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగ భద్రత కల్పించాలి




మాట్లాడుతున్న ఆర్టీసీ కార్మికులు

**కాజీపేట అర్బన్:** ఆర్టీసీ కార్మికులకు బ్రీత్ అనలైజర్ పరీక్షలు నిర్వహిస్తున్న క్రమంలో చట్టాన్ని అమలు చేస్తూ, ఎంవీ యాక్ట్ సెక్షన్ 185 ప్రకారం ఉద్యోగ భద్రత కల్పించాలని టీఎస్‌ఆర్టీసీ ఎస్‌డబ్ల్యూఎఫ్ నాయకులు కోరారు. ఈమేరకు టీజీఎస్ ఆర్టీసీ యాజమాన్యానికి వినతి పత్రం అందజేసినట్లు టీఎస్‌ఆర్టీసీ ఎస్‌డబ్ల్యూఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వీరాంజనేయులు, వీఎస్.రావు తెలిపారు. ఈ సందర్భంగా వరంగల్ -1 డిపోలో వారు గురువారం మాట్లాడుతూ 100 ఎంఎల్ దాటిన కేసుల్లో మాత్రమే కార్మికులకు శిక్ష విధించాలని, 2015లో లా డిపార్ట్‌మెంట్ విడుదల చేసిన సర్క్యులర్‌ను సవరించి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు.

# టీయూటీఎఫ్ మహాసభల పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డీఈఓ, బాధ్యులు

**విద్యారణ్యపురి:** ఆదిలాబాద్‌లో ఈనెల 10, 11వ తేదీల్లో నిర్వహించనున్న తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీయూటీఎఫ్) ఆరో విద్యా మహాసభల పోస్టర్లను హనుమకొండ జిల్లా డీఈఓ వాసంతి, సంఘం బాధ్యులు గురువారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీయూటీఎఫ్ రాష్ట్ర సహ అధ్యక్షుడు నూతనకంటి బాబు, హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి దామెర భిక్షపతి, రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ ఈదునూరి మధుసూదన్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి జాటోతు లకుపతి, వరంగల్ జిల్లా అధ్యక్షుడు చెడుపాక కృష్ణమూర్తి, బాధ్యులు దేవానంద్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి గింజనూ కొనుగోలు చేస్తాం..



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దివ్యారాణి



మడికొండలో కేంద్రాన్ని ప్రారంభిస్తున్న వనంరెడ్డి

**హసన్‌పర్తి:** రైతులు తీసుకొచ్చిన ప్రతి గింజనూ కొనుగోలు చేస్తామని పీఏసీఎస్ చైర్మన్ చల్లా గోపాల్‌రెడ్డి అన్నారు. పెగడపల్లి సొసైటీ పరిధిలోని పెగడపల్లి, ముచ్చర్లల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ నన్నబోయిన కుమార్‌యాదవ్, డైరెక్టర్లు శ్యామ్, బండా రాణి, విమల, దాసు, కనకయ్య, రాజు, సీఈఓ గణేష్ పాల్గొన్నారు.

**కొత్త నిబంధనలతో రైతులను ఆగం చేయొద్దు**

కొత్త నిబంధనలు విధిస్తూ రైతులను ఆగం చేయొద్దని కార్పొరేటర్ దివ్యారాణి అన్నారు. హసన్‌పర్తి మండలం దేవన్నపేటలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతు తీసుకొచ్చిన ప్రతీ గింజను కొనుగోలు చేయాలని కోరారు. తాలు ఉందని రైతులను ఇబ్బందులకు గురి చేయవద్దని సూచించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ చుంచు విజేందర్, మాజీ సర్పంచ్ చుంచు రవి, మాజీ కార్పొరేటర్ రాజునాయక్, టీఆర్ఎస్ నాయకుడు వాసుదేవారెడ్డి, కాంగ్రెస్ నాయకులు మల్లేశం, రాంరెడ్డి, చింత నవీన్, రవీందర్ పాల్గొన్నారు.

**మడికొండలో కొనుగోలు కేంద్రం ప్రారంభం**

**మడికొండ:** 64వ డివిజన్ మడికొండలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని దర్గా సొసైటీ చైర్మన్ ఊకంటి వనంరెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రంలోనే విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. సదరు రైతుల ఖాతాల్లో సకాలంలో ప్రభుత్వం డబ్బులు జమచేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో 64వ డివిజన్ కార్పొరేటర్ ఆవాల రాధికరెడ్డి, మాజీ కార్పొరేటర్ తొట్ల రాజుయాదవ్, దర్గా సొసైటీ డైరెక్టర్ దువ్వ శ్రీకాంత్, లింగం నరేందర్‌రెడ్డి, మెట్టుగుట్ట చైర్మన్ పైడిపాల రఘుచందర్, బైరి లింగమూర్తి, వస్కుల శంకర్, ఏఏఓ సంధ్యారాణి, నోడల్ ఆఫీసర్ యమున, సీఈఓ భూపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

## సంక్షిప్తంగా

**పెద్దమ్మ తల్లి దేవాలయాన్ని నిర్మించాలి**

**రామన్నపేట:** ములుగు రోడ్డు జంక్షన్‌లో తవ్వకాల్లో బయటపడిన పెద్దమ్మ తల్లి విగ్రహాన్ని రక్షించి, దేవాలయం నిర్మించాలని దేవాలయ పరిరక్షణ సమితి కన్వీనర్ మార్క సునీల్ కోరారు. దేవాలయ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో అనేక ఆలయాలకు సంబంధించిన భూములను కబ్జాదారులు ఆక్రమించిన సంఘటనలు చాలా ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ వరంగల్ విభాగ్ సహ కార్యదర్శి శ్రీరామ్ ఉదయ్‌కుమార్, గ్రేటర్ వరంగల్ కార్యదర్శి వెలగందుల రాజు, సహ కార్యదర్శి ఎడెల్లి సందీప్‌రెడ్డి, భజరంగ్ దళ్ సంయోజక్ కొల్లూరి ఆదిత్య సాయి, తీగల శుభ, గోనెల అనురాధ, ఇనుముల అనురాధ, పల్లె రాధిక, హనుమకొండ సుకన్య, తీగల రాధ, ఇనుముల అనిత, బీమా వినయ్, రమేష్, రవి, రాజు, కిస్టే, దేవాలయ పరిరక్షణ సమితి సభ్యులు పాల్గొన్నారు.

**వాకర్స్ ఎంజీఎఫ్ అసోసియేషన్ సమావేశం**

**విద్యారణ్యపురి:** వాకర్స్ ఇంటర్నేషనల్ -303 జిల్లా పరిధిలోని ఎంజీఎఫ్ వాకర్స్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గ సమావేశాన్ని బాల్నె శరత్‌బాబు అధ్యక్షతన హనుమకొండలోని పబ్లిక్ గార్డెన్‌లో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వాకర్స్ ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ తడక కుమారస్వామి మాట్లాడుతూ వచ్చే నెలలో సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించాలని సూచించారు. ఎంజీఎఫ్‌లో కొత్త సభ్యులను చేర్పించి అసోసియేషన్‌ను బలోపేతం చేయాలని కోరారు. సమావేశంలో సైకిల్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జంగా గోపాల్‌రెడ్డి, ఇంటర్నేషనల్ చీఫ్ కోఆర్డినేటర్ కురాకుల భారతి, గవర్నర్ ఎలక్ట్ పుల్లూరు శ్రీనివాస్‌గౌడ్, బాధ్యులు కంచెటి శోభారాణి, పెండ్లి ఉపేందర్‌రెడ్డి, గిరిజ, సీఎస్.రావు, రాజు, అశోక్ పాల్గొన్నారు. డిసెంబర్ 8న జనరల్ బాడీ సమావేశాన్ని నిర్వహించాలని నిర్ణయించారు.

**రైల్వే కార్మికుల సంక్షేమమే ధ్యేయం**

**కాజీపేట రూరల్:** రైల్వే కార్మికుల సంక్షేమమే రైల్వే మజ్దూర్ యూనియన్ ధ్యేయమని సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ సికింద్రాబాద్ డివిజన్ సెక్రటరీ పి.రవీందర్ అన్నారు. డిసెంబర్ 4, 5, 6వ తేదీల్లో నిర్వహించనున్న కార్మిక సంఘాల గుర్తింపు ఎన్నికల్లో భాగంగా నాయకులు గురువారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల కోసం అలుపెరగని పోరాటం చేస్తున్న ఎస్‌ఈఆర్‌ఎంయూ జెండా గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జమ్మికుంట బ్రాంచ్ కార్యదర్శి బచ్చలి శ్రీనివాస్, చైర్మన్ ఉప్పల రాజయ్య, ట్రెజరర్ ఎ.సాంబరాజు, వైస్ చైర్మన్లు జి.రాజేష్, జి.స్వప్న, జి.శివ, జి.క్రాంతికుమార్, అసిస్టెంట్ సెక్రటరీలు ఎంబీ.మొండయ్య, రవికుమార్, కె.రవీందర్, కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

## సర్వేలో గొర్రెల సంఖ్యను నమోదు చేయాలి

**ఖిలా వరంగల్:** కులగణన సర్వేలో గొర్రెల సంఖ్యను స్పష్టంగా నమోదు చేయాలని కురుమ సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మండల పరశురాములు గురువారం ఒక ప్రకటనలో కోరారు. దాంతో కురుమ సామాజిక వర్గ జనాభా, స్థితిగతులు వెలుగులోకి వస్తాయని పేర్కొన్నారు.

**సర్వేలో 'మేర' కులం అని చెప్పాలి**

**వరంగల్:** సమగ్ర కులగణన సర్వేలో మేర కులస్తులు పాల్గొని తమ కులం మేర అని మాత్రమే సర్వే అధికారులకు తెలియజేయాలని మేర కుల సంఘం నాయకుడు సంగ వెంకట్రాజం పిలుపునిచ్చారు. కులగణనలో నింపే దరఖాస్తు ఫారం లో బీసీ - డీ చిప్పోలు (మేర) సీరియల్ నంబర్ 5 అని ఎన్యుమరేటర్లకు చెప్పాలని పేర్కొన్నారు. అదేవిధంగా వృత్తి టైలర్ అని తెలియజేయాలని అన్నారు. కులం అడిగినప్పుడు కాలం నంబర్ 7లో మేర అని మాత్రమే పొందుపరచాలని సూచించారు.